క్లుప్తంగా

సరి చేశారు..



వేలాడుతున్న విద్యుత్ వైర్లను బాక్స్‌లో అమర్చుతున్న విద్యుత్ ఉద్యోగి

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీ మైదానం సమీపంలోని విద్యుత్ స్తంభానికి ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేశారు. సమస్యపై ఆదివారం విద్యుత్ మీటర్‌కు పైకప్పు అమర్చండి అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన శ్రీహరిపురం సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌రావు సోమవారం సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి వేలాడుతున్న వైర్లను సరిచేసి విద్యుత్ మీటర్‌కు పై కప్పు అమర్చారు. దీంతో కాలనీ వాసులు విద్యుత్ అధికాలతో పాటు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ వరప్రసాద్‌కు జాతీయ అవార్డు



కంచరపాలెం: కంచరపాలేనికి చెందిన డాక్టర్ మాముడూరి వరప్రసాద్‌కు మధ్యప్రదేశ్‌లోని సోషియల్ పాయింట్ ఫౌండేషన్ చైర్మన్ అభిషేక్ చేతుల మీదుగా 2022–23 సేవలకు గుర్తింపుగా 'భారత్ భూషణ్' అవార్డు అందుకున్నారు. సామాజిక, రాజకీయ రంగాల్లో ఉత్తమ సేవలకు గానూ ఈ అవార్డు అందుకున్నట్టు డాక్టర్ వరప్రసాద్ తెలిపారు.

ఘనంగా పైడిమాంబ అంబలం పూజ



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామూర్తి పంతులుపేటలో జరగనున్న పైడిమాంబ అమ్మవారి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం గౌరీ సేవా సంఘం మహాత్మాగాంధీ కళా సమితి ప్రాంగణంలో పైడిమాంబ అంబలం పూజ భారీ సెట్టింగ్‌లతో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక కుంకమ పూజలు, పంచామృతాభిషేకాలు చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి భక్తిగీతాల ఆలాపనతో ప్రాంగణం మార్మోగింది. భవానీ భక్తులకు, స్థానికులకు తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహారం అందించారు. సహకరించిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

దేవస్థానాల్లో ఉద్యోగం ఒక వరం



ధర్మారావు దంపతులను సత్కరిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: దేవస్థానాల్లో ఉద్యోగం చేయడం ఒక వరంగా భావించాలని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నారు. సింహాచలం దేవస్థానంలో 37 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి మంగళవారం పదవీవిరమణ చేసిన నాలుగో తరగతి ఉద్యోగి ధర్మారావు దంపతులను ఉద్యోగుల సమాఖ్య ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఈవో త్రినాథరావు మాట్లాడుతూ భగవంతుడుకి సేవ చేసే భాగ్యం కొందరికే లభిస్తుందన్నారు. దేవస్థానం ఏఈవోలు ఆనంద్‌కుమార్, ఇజిరోతు శ్రీనివాసరావు తదితరులు ధర్మారావు దంపతులను సత్కరించి వరాహ లక్ష్మీనృసింహస్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్, ఈఈ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి 'పొగ'

- జ్ఞానాపురం.. కంచరపాలెం ప్రాంతాల్లో వైర్లు, టైర్లు, ఆయిల్ ఫిల్టర్లు కాలుస్తున్న అల్లరిమూకలు
- దుర్గంధం.. శ్వాసకోశ వ్యాధులతో స్థానికుల సతమతం



జ్ఞానాపురం ఎర్రిగెడ్డలో ప్లాస్టిక్ వ్యర్థాలు, టైర్లు తగులబెడుతున్న దృశ్యం



కంచరపాలెం ఫ్లైఓవర్ రహదారిలో ఎగసిపడుతున్న పొగ

కంచరపాలెం: కంచరపాలెంలోని భారతీయ ఆహార గిడ్డంగి సంస్థ రహదారి నుంచి రామ్మూర్తిపంతులుపేట రైల్వేగేటుకు వెళ్లే రహదారి వరకు మధ్యలో అనేక స్క్రాప్ దుకాణాలు ఉన్నాయి. ఇక్కడున్న వాహనాల మరమ్మతుల దుకాణాలతో రహదారులు కాలుష్యంతో నిండిపోతున్నాయి. ఇక్కడ వ్యర్థ పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో దహనం చేయడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలుతున్న వ్యర్థాల నుంచి దుర్గంధం వెలువడుతుండడంతో వాసన భరించలేక శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. దట్టమైన పొగ వెలువడడంతో స్థానికులతో పాటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నేతాజీ ఫ్లైఓవర్ నుంచి జ్ఞానాపురానికి వెళ్లే లారీ యార్డు, ఎర్రిగెడ్డ సమీపంలో హరితవనం ప్రాంతంలో నిత్యం బయటి ప్రాంతాల నుంచి తెచ్చిన చెత్తా చెదారాలను కుప్పలుగా పోగులు పెడుతున్నారు. దీంతో ఇక్కడి ప్రాంతాలు డంపింగ్‌యార్డ్‌లుగా మారిపోతున్నాయి. పైడిమాంబ ఆలయం రహదారిలో లారీల మరమ్మతులకు చెందిన సిబ్బంది ఇంజన్లకు సంబంధించిన వ్యర్థాలను మంట పెడుతున్నారు. చిల్లర దొంగతనాలు చేసే అల్లరిమూకలు ఎక్కడి నుండో తస్కరించి తెచ్చిన విద్యుత్, కేబుల్ వైర్లు ఇక్కడే కాలుస్తున్నారు. దీంతో కార్బన్ మోనాక్సైడ్, ఇతర కాలుష్య వాయువులు వెలువడుతున్నాయి. గతంలో అనేక పర్యాయాలు ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యర్థ పదార్థాలను కాలుస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాలుష్యంతో నిండిన పొగ చుట్టుపక్కల వ్యాపించి వంతెన రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్–5 పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

వ్యర్థాలకు నిప్పు పెట్టేవారిపై ఫిర్యాదులు రాలేదు. అయినప్పటికీ ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యను గుర్తించేలా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశిస్తాం. సమస్య పరిష్కారానికి తప్పకుండా తగు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రాజేష్, ఏఎంహెచ్‌వో, పబ్లిక్‌హెల్త్, జోన్–5, జ్ఞానాపురం

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముర్రు వాణి నానాజీ, ఈఈ ప్రసన్నరెడ్డి

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు సుభాష్‌నగర్, శ్యామ్‌నగర్, ఆశవానిపాలెం, సాకేతపురం ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ ముర్రు వాణినానాజీ, జోన్–5 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.ప్రసన్నరెడ్డి మంగళవారం పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు వేగవంతం కావాలని కాంట్రాక్టర్లను ఆమె కోరారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



747వ రోజు దీక్షలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

కూర్మన్నపాలెం: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడమే కాకుండా, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలను ప్రజలు తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 747వ రోజు సంస్థకు చెందిన డీఎస్‌డబ్ల్యూ, ఈఆర్‌ఎస్‌డీ, ఈటీఎల్ కార్మికులు కూర్చున్నారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. కార్మిక శ్రేయస్సు కోరి ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే కేంద్ర ప్రభుత్వానికి ప్రజాతీర్పుతో తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు.

సీతారామాచార్యులకు ఘన సత్కారం



సీతారామాచార్యులను సత్కరిస్తున్న శృతిలయ సంస్థ ప్రతినిధులు

సీతంపేట: సింహాచలం దేవస్థానం పురోహితులు కర్రి సీతారామాచార్యులను శృతిలయ సాంస్కృతిక సంస్థ మంగళవారం సాయంత్రం ఘనంగా సత్కరించింది. శృతిలయ సాంస్కృతిక సంస్థ ఇటీవల సీతమ్మధారలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణం విజయవంతమైన సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అభినందన సభ నిర్వహించారు. కల్యాణానికి సహకరించిన దాతలు, సేవకులను సత్కరించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఆగమ సంప్రదాయాలపై జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన సదస్సులో శ్రీపాంచరాత్ర ఆగమ సంప్రదాయంపై ప్రసంగించి ప్రముఖుల అభినందనలు అందుకున్న సింహాచలం దేవస్థానం పురోహితులు సీతారామాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శృతిలయ సంస్థ వి.ప్రభాకర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, పి.రంగనాథాచార్యులు, కొణతాల రాజు, సీహెచ్‌వీ సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, వి.ఫణీంద్ర పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

చోరీ కేసు ఛేదన

సింహాచలం: నగరంలో జరిగిన శుభకార్యానికి వచ్చిన వృద్ధ దంపతుల బ్యాగ్ దొంగలించిన మహిళను పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రైం ఎస్‌ఐ సల్మాన్ బేగ్ తెలిపిన వివరాలు .. సికింద్రాబాద్ నుంచి జయంతి విజయలక్ష్మి, అచ్యుతరావు దంపతులు ఓ శుభకార్యం నిమిత్తం సోమవారం రాత్రి 7గంటల సమయంలో విశాఖపట్నం వచ్చారు. పెందుర్తి దరి పురుషోత్తపురం వెళ్లేందుకు అక్కడ ఆటో ఎక్కి బ్యాగ్‌ను ఆటో వెనుక భాగంలో పెట్టారు. పురుషోత్తపురం చేరుకున్న తర్వాత ఆటో వెనుక ఉన్న బ్యాగ్ కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. అందులో ఎనిమిది తులాల బంగారం, కొత్త వస్త్రాలు ఉన్నాయి. వెంటనే పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు రైల్వేస్టేషన్ నుంచి పెందుర్తి వరకు ఉన్న పలు సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. పాత రికార్డుల ఆధారంగా విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఒక మహిళ బ్యాగ్ దొంగిలించినట్టు గుర్తించారు. ఆమెను పట్టుకుని ఎనిమిది తులాల బంగారం, కొత్త దుస్తులు రికవరీ చేశారు.

సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం నేడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం బుధవారం జరగనుంది. శ్రీ కృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. స్వామివారి కల్యాణోత్సవం, చందనోత్సవంతో పాటు ఇతర పనులపై చర్చించనున్నారు. ప్రస్తుత ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో దేవస్థానం అధికారులు ఎలక్షన్ కమిషన్‌ను సంప్రదించారు. ఈ మేరకు చీఫ్ ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా సమావేశం నిర్వహణకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు.

వైభవంగా పర్వతాంజనేయ స్వామి పరస

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వివేకానందకాలనీలో కొలువైన పర్వతాంజనేయ స్వామి పరస మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. స్వామికి తమలపాకుల పూజ, నిమ్మకాయల పూజ, సింధూరార్చన చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ స్వామిని దర్శించుకున్నారు.

సుధాకర్ గెలుపే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్



కరాసాలో పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న ఆనంద్‌కుమార్, జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థికి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఇందుకు ప్రతి కార్యకర్త, నాయకులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల్లో అన్ని వార్డుల కంటె ఎక్కువ మెజారిటీతో గెలిచానని.. అదే విధంగా తమ వార్డులోను అత్యధిక మెజారిటీ సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవివర్మ, వెదుళ్ల శ్రీనివాసరావు, జియ్యాని మారుతి, పద్మ, జ్యోత్స్న, సఖి తదితరులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 92వ వార్డులోను ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందిరానగర్, గణేష్‌నగర్, లక్ష్మీనగర్, అప్పాజీటవర్స్, బీపీఎల్ గొడౌన్స్ ప్రాంతాల్లో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పట్టభద్రులను కలిసి తొలి ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి కంపర కోటేశ్వరరావు, 91వ వార్డు ఇన్‌చార్జి పైడిరాజు, కంపర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని దుర్గానగర్, ఎస్సార్‌కాలనీ, త్రినాథపురం, గుడివాడ అప్పన్న కాలనీ తదితర ప్రాంతాల్లో విశాఖ డెయిరీ చైర్మన్, పశ్చిమ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మార్చి 13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మల్కాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ మంగళవారం ప్రచారం సాగించారు.

ఆటోనగర్ 'డి' బ్లాక్‌లో 'స్వచ్ఛ పక్వాడా'

పాల్గొన్న ఎంఎస్‌ఎంఈ, వాసీవా, ఐలా ప్రతినిధులు



ఆటోనగర్ 'డి' బ్లాక్‌లో రోడ్లు శుభ్రం చేస్తున్న ఎంఎస్‌ఎంఈ, వాసీవా, ఐలా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ 'డి' బ్లాక్‌లో మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) ఆధ్వర్యంలో ఆటోనగర్ ఐలా, విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సహకారంతో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీ బ్లాక్‌లోని విశాఖ రూఫింగ్ ఇండస్ట్రీ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ అధికారులు, వాసీవా, ఐలా ప్రతినిధులు, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొని, రోడ్లను శుభ్రపరిచారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. బ్యానర్లను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. తమ పరిశ్రమలతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలన్నీ శుభ్రంగా ఉండేటట్లు నిర్వహణ చేపడతామని పారిశ్రామిక వేత్తలు ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్, ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఎంఎస్‌ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్ కుమార్, ఎస్.ఎల్.ఎన్.కుమార్, రెడ్డి, అప్పికొండ శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అటు నేహా..ఇటు అనసూయ

- పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవంలో మెరిసిన తారలు
- తన గళంతో ఆకట్టుకున్న మోహన భోగరాజు



కళాకారులతో డ్యాన్స్ చేస్తున్న అనసూయ

సబ్బవరం: ఉదయం భక్తులతో ఆ ప్రాంగణం పులకించింది.. సాయంత్రం సెలబ్రెటీలతో సందడి నెలకుంది. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా..బుల్లితెర బ్యూటీ అనసూయ కిరాక్ పుట్టించింది. బుల్లెట్ బండీ సింగర్ మోహన భోగరాజు తన గళంతో ఈవెంట్‌ను తారాస్థాయికి తీసుకువెళ్లారు. జబర్దస్త్ యాంకర్ సౌమ్యరావు తన మాటలతో ఆకట్టుకున్నారు. మండలంలోని తవ్వవాని పాలెంవాసుల ఆరాధ్య దేవత పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం అత్యంత వైభంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండగ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన గుర్రపు పందాలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. అనుపు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ మందుగుండు పోటీలు మిరమిట్లు గొలిపాయి. రాత్రికి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమంతో పాటు రాకెట్ రాఘవ టీమ్‌తో పాటు పలువురు వెండి, బుల్లితెర నటులు సందడి చేశారు.

చిట్టి చేతులు.. గట్టి ఆవిష్కరణలు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



డాక్టర్ సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న ఎన్‌ఎస్టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు



గోపాలపట్నం బాలికల పాఠశాలలో మాన్యువల్ ప్రాజెక్టర్ గురించి వివరిస్తున్న విద్యార్థిని



గోపాలపట్నం బాలాజీ పాఠశాలలో ..



ఎన్ఏడీ రవీంద్ర భారతి పాఠశాలలో..

గోపాలపట్నం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పలు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. విభిన్న అంశాలపై ఏర్పాటు చేసిన నమూనాలు విద్యార్థుల ప్రతిభను చాటి చెప్పాయి.

- ఎన్ఎస్టీఎల్‌లో మానసి ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి. సేషూభాయ్, కమాండ్ మెడికల్ ఆఫీసర్ ఈస్టర్న్ నేవల్ కమాండ్ సర్జన్ రియల్ అడ్మిరల్ ఆర్.రవి, ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు ప్రముఖ శాస్త్రవేత్త రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామన్ ఎఫెక్ట్ గురించి వివరించారు. సైన్స్‌డే సందర్భంగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టెక్నాలజీ కార్యక్రమంలో ఎంకే –2, 200లిథియం ఐయాన్ బ్యాటరి టెక్నాలజీని భారత్ ఎల్రక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థకు బదిలీ చేశామన్నారు. దీని పత్రాలను ఆ సంస్థ జీఎం మూర్తికి అందించారు. దేశం మొత్తంగా 7 ప్రాజెక్టుల్లో మనకు మెట్ మిల్లన్ బుడ్డింగ్ సైంటిస్ట్ అవార్డు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ సైన్స్‌డే కార్యక్రమం చైర్మన్ టీవీఎస్ఎల్ సత్యవాణి, సీనియర్ శాస్త్రవేత్తలు పీవీఎస్ గణేష్, బీవీఎస్ఎస్ కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ..

గోపాలపట్నం ,ఎన్ఏడీ పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సైన్స్‌డే ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మెచ్ఎం ఎస్తేర్ హెప్సిబా సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు పలు అంశాలపై తయారు చేసిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి.

- గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రధానోపాధ్యాయురాలు రజని ప్రారంభించారు. వాటర్ ప్రెజర్‌తో గేమ్ ఆడడం, గాలి ఒత్తిడి ద్వారా పొక్లెయినర్ పనులు చేయడం వంటివి ఆకట్టుకున్నాయి.
- బుచ్చిరాజుపాలెం గవర వీధి జీవీఎంసీ యూపి స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రధానోపాధ్యాయురాలు భవాని ప్రారంభించారు.
- రవీంద్రభారతి , గోపాలపట్నం బాలాజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్‌లోని ఏవీకే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ మానవజీవన విధానాన్ని విపులంగా వివరిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మానస త్రినాథ్,వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభించిన పీవీ సురేష్